క్లుప్తంగా

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం కొత్త ఇసుకపల్లి జంక్షన్‌లోని దుర్గాదేవి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు పలు రకాల పిండి వంటలతో అన్నదానం ఏర్పాటు చేశారు. కొండెవరం, నవకంద్రవాడ, ఇసుకపల్లి, శొంఠివారిపాకలు తదితర గ్రామాలకు చెందిన సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



జె.తిమ్మాపురం పాఠశాలలో బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న శేఖర్

పెద్దాపురం: గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని పెద్దాపురం తాళ్లూరి సత్రం అధ్యక్షులు డాక్టర్ తాళ్లూరి శేఖర్ అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో సుమారు రూ.1.50 లక్షలతో బోర్‌వెల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం వర్మ అధ్యక్షతన జరిగిన బోర్‌వెల్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు విద్యాభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి ప్రసాద్, సురేష్, కామేష్, ఉపాధ్యాయులు దత్తు, లక్ష్మి, లలిత, సీతారాంకుమార్, దుర్గాప్రసాద్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



బస్సును పొక్లెయిన్‌తో బయటకు తీస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రైవేటు బస్సు అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు సోమవారం అదుపు తప్పి పొలాల్లోనికి దూసుకు వెళ్లింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు గోతులతో నిండి ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వికె రాయపురం–మాదపటన్నం మధ్యలో బస్సు నిలిచి పోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో బస్సును వెనకకు తిప్పి అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా వెళ్లడానికి ప్రయత్నం చేసే క్రమంలో బస్సు పొలాల్లోకి దూసుకుపోయింది. ట్రాఫిక్ ఎస్సై గరగారావు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేటి నుంచి రీ సర్వే గ్రామ సభలు

సామర్లకోట: రీ సర్వేలో ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలను స్వీకరించడానికి మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి సోమవారం తెలిపారు. తనకు చెందిన భూమి మరొకరి పేరున ఉండటం, దస్తావేజు, పాస్ బుక్‌లో ఉన్న భూమి ప్రకారం రీ సర్వేలో రాకపోవడం వంటి వాటిని సవరణ చేయడానికి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22న ఉండూరు, 23న వల్లూరు, 25న మామిళ్లదొడి, 26న మాధవపట్నం, 29న అచ్చంపేట, కొప్పవరం, నవంబరు 2న పనసపాడు, 5న గొంచాల, 6న నవర, 7న పంద్రవాడ, 8న పవర, 12న చంద్రంపాలెం, 13న కాపవరం, 14న పి.వేమవరం, 16 వికె రాయపురం, 19న బోయనపూడి, 20న మేడపాడు, 22న పెద్ద బ్రహ్మదేవం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు

పెద్దాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి పెద్దాపురం ఏడీబీ రోడ్డులో చోటు చేసుకుంది. పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక వివరాల మేరకు స్థానిక సూరంపాలెం రోడ్డులో ఎలక్ట్రికల్ బైక్‌పై వెళుతున్న ఇరువురు వ్యక్తుల్లో రంపం నాగేశ్వర రావు (45) అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కార్తీక మాసోత్సవాలకు సంసిద్ధం

- పాదగయ క్షేత్రంలో జోరుగా ఏర్పాట్లు
- పుష్కరిణిలోకి కొత్త నీరు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు



పిఠాపురంలోని పాదగయక్షేత్రం

పిఠాపురం: పవిత్ర కార్తికమాసం ప్రారంభం కానుండడంతో నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ శైవ క్షేత్రమైన స్థానిక పాదగయ పుణ్యక్షేత్రంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లతో పాటు ప్రత్యేక అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి కార్తికమాసం ప్రారంభం కానుండగా వేలాది మంది భక్తులు పుణ్య స్నానాల కోసం పాదగయకు తరలి వచ్చే అవకాశం ఉంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పుష్కరిణి రెడీ

పాదగయ పుష్కరిణిలో పాత నీరు తొలగించిన అధికారులు కొత్త నీటిని నింపే పనులు ప్రారంభించారు. ఎక్కువగా పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలకే భక్తులు ప్రాధాన్యతను ఇస్తుంటారు. మహిళలు పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి పుష్కరిణిలో కార్తిక దీపాలను వదులుతుంటారు. దీని కోసం ఆలయ అధికారులు పుష్కరిణిలో కొత్త నీటిని నింపడంతో పాటు కార్తిక దీపారాధనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. కార్తికమాసం సందర్భంగా తొలి రోజు నుంచి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజూ స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్తిక మాసం ప్రారంభమవ్వనుండడంతో పలువురు భక్తులు శివదీక్షలు స్వీకరిస్తున్నారు.

దూర ప్రాంతాల భక్తులకు ఆన్‌లైన్‌లో పూజలు

పవిత్ర కార్తిక మాసంలో పాదగయ క్షేత్రంలో పూజలు చేయించుకోవాలనుకునే దూరప్రాంతం భక్తులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ పూజలకు టిక్కెట్లు తీసుకున్న వారి పేరున వారు కోరుకున్న రోజున పూజలు నిర్వహించి ప్రసాదాలు పోస్టు ద్వారా పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలకు ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా సోమవారాలు వంటి ప్రాముఖ్యత కలిగిన రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందరికీ స్వామి వారి దర్శనం కలిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గతేడాది కార్తిక మాసంలో సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దానికి రెట్టింపు సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనవేళలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– భద్రరావు, సూపరింటిండెంట్, పాదగయ క్షేత్రం, పిఠాపురం

పంచారామ క్షేత్రానికి భక్తుల తాకిడి



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారు జామున తొలి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తిలకించడానికి తెల్లవారు జాము నుంచి భక్తులు బారులు తీరారు. స్వయంగా స్వామి వారికి అభిషేకాలు చేసుకొనే భక్తులు ఆలయ ధ్వజ స్తంభం వద్ద శివలింగానికి ఆలయ కోనేరులోని నీటితోను, పాలతోను అభిషేకాలు చేసుకున్నారు. పెద్ద నంది, మూలవిరాట్, ఉప ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం భక్తులకు ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజగోపాల్‌శర్మ, ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్‌లు స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గానూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో అయా మండలాల నుంచి ఆరు అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని సంబంధిత శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతీ అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశ్యంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద అయా శాఖల మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు వివిధ సమస్యలపై 14 ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించడం జరిగిందని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సరిత, సీడీపీఓ ఉష, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శివారు చిన్న కలవలదొడ్డిలో తాగునీటి కుళాయిల వద్ద అపరిశుభ్రత నెలకొంది. దీనిపై సోమవారం 'క్షీణిస్తున్న పారిశుధ్యం' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన అధికారులు హుటాహుటిన పారిశుధ్యం మెరుగు పరిచారు. కుళాయిల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు. మురుగునీరు పోయేందుకు కచ్చా డ్రైన్ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి చెల్లిబోయిన వేణుగోపాలరావు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు నిర్వహించారు.

సాక్షి ఇంపాక్ట్



చిన్న కలవలదొడ్డిలో వ్యర్థాలు తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు

పట్టణంలో జోరుగా అన్నదానాలు



సామర్లకోట గణపతి ఆలయం పూజల్లో దొరబాబు

సామర్లకోట: పట్టణ పరిధిలో అన్నదాన కార్యక్రమాలను సోమవారం జోరుగా నిర్వహించారు. స్థానిక లారీ స్టాండ్ వద్ద లారీ ఓనర్స్ అండ్ వర్కర్సు అసోసియేషన్ అధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని భారీ అన్నదాన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్ని ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, సేపెని సురేష్, రెడ్నం దొరబాబు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్, కార్యదర్శి పెదిరెడ్ల కృష్ణ, పబ్బు వేణు తదితరులు భక్తులకు సేవలందించారు. బ్రౌన్‌పేటలోని కనకదుర్గ ఆలయం వద్ద ఆలయ కమిటీ ధర్మకర్త నూతలపాటి సింహాచలం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, నిమ్మకాయల రంగనాగ్, కిరణ్, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవుల త్యాగాలు వెలకట్టలేనివి



సంస్మరణ సభలో నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు



సామర్లకోటలో పోలీసు అమరవీరుల సంస్మరణ ర్యాలీ

పెద్దాపురం: అమర జీవుల త్యాగాలు వెలకట్టలేనివని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు అన్నారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన సంస్మరణ సభకు సీఐ టి.క్రాంతికుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఎస్ఐ మౌనిక అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనదని విధి నిర్వహణలో అశువులు బాసిన అమరజీవుల త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. జాతి కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాల స్మరించుకుంటూ అంజలి ఘటించారు. అనంతరం మున్సిపల్ సెంటర్, మెయిన్‌రోడ్డు, వేముల వారి సెంటర్, వెంకటేశ్వర స్వామి గుడి వీధి, ధర్గా సెంటర్‌ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, సచివాయాల మహిళా పోలీసులు, ఆటో యూనియన్ వర్కర్లు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలను గుర్తెరగాలి

సామర్లకోట: పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతీ ఒక్కరూ గుర్తెరగాలని సీఐ కృష్ణ భగవాన్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. స్థానిక అవుట్ పోలీసు స్టేషన్ నుంచి పోలీసు రింగ్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. రింగ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం పోలీసులు నిరంతరం పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వీఎస్ఆర్ మూర్తి, అడపా గరగా రావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సేపెని సురేష్, పోలీసు సిబ్బంది, ప్రతిభా విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్



కాకినాడ రోడ్డులో వీకే రాయపురం-మాధవపట్నం మధ్యలో నిలిచి పోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో సోమవారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. వికె రాయపురం–మాధవ పట్నం గ్రామాల మధ్య బస్సు సాంకేతిక లోపంతో నిలిచి పోయింది. అసలే గోతులతో ఉన్న రోడ్డులో బస్సు రోడ్డు మధ్యలో నిలిచి పోవడంతో ట్రాఫిక్ ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర నిలిచి పోయింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో సంఘటనా ప్రదేశానికి చేరుకొని బస్సును పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సుమారు రెండు గంటల పాటు వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సామర్లకోట– కాకినాడ రోడ్డు అడుగడుగునా గోతులతో నిండినా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దొరబాబు

సామర్లకోట: విద్యుదాఘాతం కారణంగా మృతి చెందిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు డిమాండ్ చేశారు. నీలమ్మ చెరువు వద్ద వీర్రాఘవపురంలో ఎర్త్ వైర్ కారణంగా తల్లి చిట్టుమాని పద్మ, కుమారుడు నాని మృతి చెందడంతో వారి కుటుంబాన్ని దొరబాబు సోమవారం పరామర్శించారు. ఎర్త్ వైర్ కారణంగా ప్రమాదం జరగడంతో ట్రాన్స్‌కో అధికారులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి వారిని ఆదుకోవాలన్నారు. మృతురాలు భర్త కామరాజును మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు చిట్టుమాని రాఘవ, సేపెని సురేష్, పాగా సురేష్, నేతల హరిబాబు, పార్టీ నాయకులు చిట్టుమాని శ్రీనివాసరావు, వారా సుధాకర్, పాలిక చంటిబాబు పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితం.. ఆచరణలో శూన్యం

అమలుకు నోచుకోని వన్‌వే



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య

సామర్లకోట: పట్టణంలో వన్‌వే అమలు ప్రకటనలకే పరిమితం అవుతుందనే విమర్శలు ఉన్నాయి. పెద్దాపురం–సామర్లకోట ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణంతో వన్‌వేకు బ్రేక్ పడింది. తరువాత వచ్చిన సీఐలు వన్‌వే అమలు చేస్తామని ప్రకటనలు చేశారు. ఇంతలోనే వారు బదిలీలు కావడంతో అమలు తిరిగి మొదటికి వచ్చింది. పట్టణంలో వన్‌వే అమలు చేయాలని గతంలో అనేక పర్యాయాలు మానవ హక్కుల సంఘ నాయకులు సామర్లకోట వచ్చిన ఎస్పీలకు ఫిర్యాదులు ఇచ్చారు. అయినా అమలుకు మాత్రం నోచుకోలేదు. దీంతో నిత్యం మఠం సెంటర్, బళ్లమార్కెట్ సెంటర్, పెద్దబజార్ వద్ద ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నారు. ఇరుకు రోడ్లు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆదివారం అయితే ఉదయం, సాయంత్రం సమయాల్లో పెద్దాపురం రోడ్డులో మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. గతంలో ఈ ప్రదేశంలో ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహించేవారు. గత కొన్ని రోజులుగా పోలీసు సిబ్బంది ఈ ప్రదేశాలల్లో కనిపించక పోవడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. వన్‌వే అమలు జరిగితే ఇటువంటి సమస్యలు ఉండవని, పోలీసు సిబ్బందితో పని ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గం కాకినాడ జిల్లాలో అగ్ర స్థానంలో నిలిచే విధంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మాధవపట్నం గ్రామంలో పల్లె పండుగ సందర్భంగా సోమవారం ఆయన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొని వచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. అదే విధంగా మండలానికి, పంచాయతీలకు వచ్చే నిధులతో ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. మాధవపట్నం కాకినాడకు సమీపంలో ఉండటం వలన అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. గ్రామాలలో సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి భద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, ఎంపీడీఓ కె హిమ మహేశ్వరి, ఈఓపీఆర్డీ బైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.